నమస్తే తెలంగాణ
# జిందగీ



ఒకప్పుడు హీరో ఎలివేట్ కావడానికి.. చుట్టూ ఓ నలుగురు దోస్తులు ఉండేవాళ్లు. ఈ తొట్టిగ్యాంగ్ పిట్టగోడెక్కి లొట్టిపిట్టల్లా మెడలు సాచి.. కుళ్లు జోకులు వేస్తూ ఉండేవాళ్లు. హీరో చేతుల్లో తన్నులు తింటూ రీల్స్ గడిపేసేవాళ్లు. తీరా ఎడిటింగ్ అయ్యాక వాళ్ల ప్రతిభ నాలుగు సీన్లకు పరిమితమయ్యేది. వీళ్ల రెమ్యునరేషన్ కిళ్లీ కొట్లో ఖాతా అంతే ఉండేది!! కానీ, ఇప్పుడు అలా కాదు.. టైమ్ మారింది.. డైరెక్టర్లు మారారు.. వారి తాలుకూ కథలు మారాయి.. ఆ నలుగురు ఫ్రెండ్సే హీరోలుగా ముందుకొస్తున్నారు.. చరితను మార్చేది వీళ్లు.. అంటూ ప్రశంసలు అందుకుంటున్నారు..

# కుర్రాళ్లోయ్ కుర్రాళ్లు

## నేటి తెలుగు సినిమా మొనగాళ్లు!

'ఆయ్..' మేం మీ 'కమిటీ కుర్రాళ్లం' అంటున్నారు యంగ్ ఫ్రెండ్స్. ఇంకా ముందుకెళ్తే.. ఆ 'జాతిరత్నాల' గురించి ఎంతైనా చెప్పొచ్చు. 'బ్రోచేవారెవరురా' అంటూ హీరోలే సినిమాల్ని కాపాడనక్కర్లేదని నిరూపించారు. 'ఓం భీమ్ బుష్' అంటూ అల్లరి చేశారు.. ప్రేక్షకుల్ని అలరించారు. అందుకే ఇప్పుడో ట్రెండ్ నడుస్తున్నది.. కథలు చెప్పేందుకు క్యారెక్టర్లు కావాలి తప్ప.. కటవుట్‌తో పని లేదని..!! అందుకే కంటెంట్ ఉన్న కుర్రాళ్లంతా.. సక్సెస్‌కి కేరాఫ్‌గా నిలుస్తున్నారు.

**సినిమా** అవకాశాలంటే ఒకప్పుడు పెద్ద ప్రాసెస్ ఉండేది. ఫొటోషూట్‌లు చేయడం. ఆల్బమ్‌లు పట్టుకుని ఇండస్ట్రీలోని గడపలన్నీ ఎక్కిదిగడం ఉండేది. అదృష్టవంతులకు అవకాశం రావడానికి నెలలు పడితే.. ఇతరులకు ఏళ్లూపూళ్లూ గడిచేవి. 'ఒకే ఒక్క చాన్స్' కోసం జీవిత కాలం ఎదురు చూసేవాళ్లు. కానీ, ఇప్పుడు ఈక్వేషన్స్ మారిపోయాయి. ఫొటోషూట్‌లు.. ఆల్బమ్‌ల స్థానంలో.. సొంత యూట్యూబ్ చానెళ్లు.. ఇన్‌స్టా అకౌంట్‌లు వచ్చేశాయ్! రీల్స్‌తో రియల్‌లైఫ్‌లో హీరోలు అయిపోతున్నారు. ఎవరి షార్ట్‌ఫిల్మ్‌లు వారికి ఎటూ ఉన్నాయ్. ఇవన్నీ దాటుకుని కొందరు.. ఓటీటీల్లో టాలెంట్ చూపిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ.. మొబైల్ మాధ్యమాల్లోనూ.. ఫ్యాన్ బేస్‌ని క్రియేట్ చేసుకుంటున్నారు.

**'కమిటీ కుర్రోళ్లు'** సినిమాలో నటించిన వారిలో చాలామంది ఈ కోవకు చెందినవారే. ముఖ్యంగా ప్రసాద్ బెహరా. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వారికి ప్రసాద్ సుపరిచితుడే! యూట్యూబ్‌లో అతగాడి షార్ట్ ఫిల్మ్స్‌కి పిచ్చ లైక్‌లూ.. కామెంట్లూ వచ్చిపడుతుంటాయ్! తన కామెడీ టైమింగ్‌తోనే కాదు.. సెంటిమెంట్ డైలాగ్స్‌తోనూ.. రైటర్‌గా సత్తాచాటాడు ప్రసాద్. 'కమిటీ కుర్రోళ్లు'లో తనదైన నటనతో అందరి మెప్పు పొందాడు. ప్రసాద్.. ఓ అంగన్వాడీ టీచర్ కొడుకు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేనివాడు. యూట్యూబ్‌ను నమ్ముకున్నవాడు. అటువంటి వాడు ఈ రోజు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాడు. ప్రసాద్ ఒక్కడే కాదు.. 'కమిటీ కుర్రాళ్లు'లోని 11 మందీ వారివారి పాత్రల్లో చక్కగా ఒదిగిపోయారు. అందుకేనేమో.. మెగాస్టార్ సైతం ఈ యువకులు ఖుష్ అయ్యేలా... 'అందరూ చాలా బాగా నటించారు. సినిమా చూస్తున్నప్పుడు కొత్తవాళ్లు నటించారనే విషయాన్ని మరచిపోయాను. ఈ చిత్రంలో భావోద్వేగ సన్నివేశాలు చక్కగా పండాయి..' అని కాంప్లిమెంట్ ఇచ్చారు.

### సదా.. సీదా కుర్రాళ్లకే ఫిదా!

ఓ నలిగిపోయిన కాటన్ షర్ట్.. చెదిరిపోయిన జుట్టుతో 'తమ్ముడూ' అని పిలిచి.. 'తొలిప్రేమ'తో అలరించిన పవర్ స్టార్ రోజులు గుర్తున్నాయా? ఓ ఇరవై ఏండ్ల క్రితమే ఆ నలుగురు ఫ్రెండ్స్‌లో పవన్ చాలా కాజువల్‌గా కలిసిపోయాడు. హీరో అంటే సిక్స్‌ప్యాక్స్‌తో సిక్స్ ఫీట్ ఉండక్కర్లేదు.. పక్కింటి అబ్బాయిలా ఉన్నా చాలని ప్రూవ్ చేశాడు. దాన్నే నేటితరం జెన్ 'జీ' బాగా జీర్ణించుకుని సినిమా జిందగీలో తమదైన ముద్రవేస్తున్నది. జాతిరత్నాలుగా సిల్వర్ స్క్రీన్ తెరపై వెలుగుతున్నది. 'నేను రైస్ పెడతా.. నువ్వు కర్రీస్ తే మామా!' అంటూ రియల్ లైఫ్ రూమ్‌మేట్స్‌కి బ్యాచిలర్ లైఫ్‌ని గుర్తుచేసిన ప్రియదర్శిని ఎలా మర్చిపోతాం. 'ఎంత పెద్దమాట అన్నాడు సార్ వాడు.. ' అంటూ నవీన్ పొలిశెట్టిని మరెవ్వరితో పోల్చలేం. కాళ్లకు హవాయ్ చెప్పులు కూడా వేసుకోని.. డైరెక్టర్ అనుదీప్‌ని అయితే సింప్లిసిటీకి కేరాఫ్ అనొచ్చు. తన డైలాగ్స్, మేనరిజమ్స్‌తో నేటి కుర్రాళ్లకు తనదైన సిగ్నేచర్ సౌండ్స్‌తో కొత్త ఊపు తీసుకొచ్చాడు.

### అప్పుడూ ఉన్నారు

**నలుగురు** స్నేహితులు ఆడుతూపాడుతూ సందడి చేసిన సినిమాలు తెలుగులో గతంలోనూ ఉన్నాయి. నలుగురికీ సమప్రాధాన్యం ఉన్న సినిమాలు మాత్రం తక్కువనే చెప్పాలి. స్నేహితులంతా కలగలిసి కథను నడిపించిన సినిమాల్లో ఒకటి 'మధురానగరిలో'. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా 1991లో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. క్రైమ్ థ్రిల్లర్ కథను కామెడీ జానర్‌గా తెరకెక్కించి సక్సెస్ కొట్టాడు కోడి. ఇందులో శ్రీకాంత్, రవిశంకర్, చిన్నా, రియాజ్ ఖాన్ నలుగురు స్నేహితులుగా నటించారు. శ్రీకాంత్ కూడా అప్పటికి కొత్త హీరోనే! కథానాయిక నిరోష. వీరితో డైరెక్టర్ కోడి రామకృష్ణ చేసిన ప్రయోగాన్ని ప్రేక్షకులు హిట్ చేశారు. దర్శకుడు వంశీ తొలిచిత్రం 'మంచుపల్లకీ' దోస్తులందరి కథే! ప్రధాన స్నేహితుడు చిరంజీవి. అతని జోడుగాళ్లుగా రాజేంద్రప్రసాద్, సాయిచంద్, గిరీష్ ప్రధాన్, నారాయణరావు మెప్పించారు. కథానాయిక సుహాసిని. విషాదంతో అంతమయ్యే ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర పరాజయాన్ని మూటగట్టుకుంది.

క్లైమాక్స్ అంటే.. గుండెల్నీ పిండేసే సన్నివేశాలు.. బాంబ్ బ్లాస్ట్‌లు.. రక్తపాతాలు, చివరాఖరికి సందేశాలు అని బలంగా ఫిక్సయిన తెలుగు ప్రేక్షకులకు కొత్త తరహా ముగింపు పరిచయం చేసి శభాష్ అనిపించుకున్నాడు. మామూలు కథలను.. అంతకన్నా సాదాసీదా కుర్రాళ్లతో తీసి హిట్ కొట్టొచ్చని నిరూపించాడు అనుదీప్. ఈ నయా దోస్తులు కామెడీ టైమింగ్‌లోనే కాదు.. స్టోరీని నడిపించడంలోనూ, సంభాషణల్ని పండించడంలోనూ... దిట్టలు అనిపించుకున్నారు.

**ఏ** యాస మాట్లాడినా.. ఎలాంటి ప్రాసలు వాడినా.. కథను నడిపించడానికి క్యారెక్టర్లే ముఖ్యం. అలా ఓ ముగ్గురు యువకులు గోదారి గట్టుపైన చేసిన సందడే 'ఆయ్' సినిమా! అందమైన బాల్యం, చిన్ననాటి జ్ఞాపకాలు, అనుబంధాలు, పల్లె అందాలను తమ పదునైన యాసతో కలగలిపి కార్పొరేట్ వరల్డ్‌కు పరిచయం చేశారు ఆ ముగ్గురు. ఇవి కదా ఆర్గానిక్ కథలు అంటూ.. హెల్తీ కంటెంట్‌ను అందించారు. ఇంకేముంది.. 'ఆయ్' సూపర్ హిట్. చిన్న కథల్లో, చిన్న నటుల్లో ఇంత పెద్ద సక్సెస్ దాగుందని ఇండస్ట్రీలోని పెద్దవాళ్లూ బలంగా నమ్ముతున్నారు. అందుకే బడా నిర్మాతలు బారికేడ్లు తీసేసి బడ్జెట్ సినిమాలకు మొగ్గు చూపుతున్నారు. ఉత్సాహవంతులైన యువకులు ఎవరైనా మంచి కథతో వస్తారేమోనని ఎదురుచూస్తున్నారు.

**సినిమా** హిట్ అవ్వాలంటే.. 'ప్రధాన తారాగణం భారీ నటులై ఉండాలి, హీరో ఇంట్రడక్షన్ అదిరిపోవాలి.. ఇంటర్వెల్‌కు ముందు ట్విస్ట్ ఉండాలి.. క్లైమాక్స్‌లో కండ్లు చెమ్మగిల్లాలి..' ఈ ఫార్ములాకు కాలదోషం పట్టిందనే చెప్పాలి. ఈ తరహా కథలతో ప్రొడ్యూసర్ ఇంటి ముందు పడిగాపులు కాసే కుర్రాళ్లు ఇప్పుడు వెతికినా దొరకరు. గల్లీ పోరగాళ్ల కథతో విజయాన్ని అందుకుంటున్నారు. సిల్లీ కామెడీతో కడుపుబ్బా నవ్విస్తున్నారు. వీరి ట్రెండ్ గమనించిన పెద్ద హీరోలు సైతం.. ఈ యంగిస్థాన్‌లను ఇంటికి పిలిపించుకొని మరీ ప్రశంసిస్తున్నారు. ఈ తరహా యంగ్ థాట్స్‌కు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఏ స్టార్‌డమ్ లేని దోస్తుగాళ్లను ఓవర్‌నైట్‌లో సెలెబ్రిటీలను చేసేస్తున్నారు. అందుకే కుర్రాళ్లే.. నేటి తెలుగు సినిమా మొనగాళ్లు! అనడంలో సందేహమే లేదప్పా!!

... రాజేశ్ యడ్ల



# మాకూ ఉన్నాయ్ కష్టాలు

**సినీ** తారలూ మనుషులే. వారికీ కష్టాలూ, కన్నీళ్లూ ఉంటాయి. సెలెబ్రిటీలు అయినంత మాత్రాన వారి జీవితం ఎప్పుడూ ఆహ్లాదకరంగా ఉంటుందనుకుంటే పొరపాటు. చాలామంది నటీనటులు తమ జీవితంలోని ఒడుదొడుకుల గురించి పంచుకుంటూ ఉంటారు. బాలీవుడ్ నటి రాణి ముఖర్జీ కూడా తన జీవితంలో ఎదురైన విపత్కర పరిస్థితులను ఇటీవల ఓ వేదికపై షేర్ చేసుకున్నది. 'కరోనా మహమ్మారి ప్రపంచం మొత్తాన్ని ఇబ్బంది పెట్టింది. ఆ సమయంలోనే నా జీవితంలో కూడా విషాదం చోటుచేసుకుంది. 2020లో రెండోసారి గర్భం దాల్చాను. దురదృష్టవశాత్తు 5 నెలలకే బిడ్డను కడుపులోనే కోల్పోయాను. ఈ సంఘటన గురించి ఎవ్వరికీ తెలియదు. కొన్ని విషయాలను బయటకు చెబితే సినిమా ప్రమోషన్ల కోసం అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే ప్రమోషన్స్ చేసే సమయంలో నా వ్యక్తిగత విషయాలను ప్రస్తావించను' అని తన జీవితంలోని చేదు జ్ఞాపకాన్ని పంచుకున్నదామె. ఈ సంఘటన తర్వాత పది రోజులకు నిర్మాత నిఖిల్ అద్వానీ ఫోన్ చేసి 'మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే' సినిమా కథ చెప్పారని ఆమె పేర్కొన్నది. 'నార్వే లాంటి దేశంలో ఒక భారతీయ కుటుంబం అన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నదా అంటే అస్సలు నమ్మబుద్ధి కాలేదు. కానీ, నిజమని తెలిశాక వెంటనే ఆ చిత్రానికి ఓకే చెప్పాను' అని చెప్పుకొచ్చింది రాణి.

ఓటీటీ హిట్



# భవిష్యత్ భయం

## టారో

**నెట్‌ఫ్లిక్స్:** స్ట్రీమింగ్ అవుతున్నది
**నటీనటులు:** అవంతిక వందనపు, జాకబ్ బాటలాన్, హారియెట్ స్లేటర్
**దర్శకుడు:** స్పెన్సర్ కోహెన్, అన్నా హాల్బర్గ్

**కామెడీ,** రొమాన్స్ జానర్ సినిమాలను ఒక్కో వర్గం ప్రేక్షకులు ఇష్టపడతారు. ఎక్కువమంది ప్రేక్షకులు చూడడానికి ఆసక్తి కనబరిచేది మాత్రం హారర్ చిత్రాలే. టాలీవుడ్ టు హాలీవుడ్ హారర్ సినిమాలు ఎప్పటికప్పుడు కొత్తగా పుట్టుకొస్తాయి. దయ్యాల కథలకు ఉన్న డిమాండ్ అలాంటిది మరి. ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన హారర్ సినిమా 'టారో' (Tarot) రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది.

**కథ ఏంటంటే..:** కొందరు స్నేహితులు వీకెండ్లో ఎంజాయ్ చేయడానికి మారుమూల ప్రాంతంలోని ఒక ఇంటికి వెళతారు. అక్కడ వారికి కనిపించిన పెట్టెలో టారో కార్డులు ఉంటాయి. ఆ బృందంలోని ఒక అమ్మాయి, టారో కార్డుల ఆధారంగా మిగిలిన స్నేహితుల భవిష్యత్తు చెబుతుంది. వారు ఎలా పుట్టారు, ఎలా మరణిస్తారు అనే విషయాలను తెలియజేస్తుంది. టారో కార్డుల ప్రకారం చెప్పిన భవిష్యత్తు నిజమైందా? వాటి కారణంగా స్నేహితులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారు..? అనేది అసలు కథ. బ్రహ్మోత్సవం సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అవంతిక వందనపు ఈ సినిమాలో ముఖ్యపాత్ర పోషించింది. తెలుగుతోపాటు పలు భాషల సినిమాల్లో నటించిన అవంతిక.. ప్రస్తుతం హాలీవుడ్ సినిమాల్లో సత్తా చాటుతున్నది. జాకబ్ బాటలాన్, హారియెట్ స్లేటర్ సహ నటీనటులు పాత్ర పరిధిమేరకు మెప్పించారు. హారర్ జానర్ సినిమాలను ఇష్టపడే వారికి టారో సినిమా తప్పక నచ్చుతుంది.

# నాతో అందుకే చేయలేదు

**బాలీవుడ్** అందాల తార శ్రద్ధా కపూర్ ప్రస్తుతం మంచి జోష్‌లో ఉన్నారు. తాజాగా ఆమె నటించిన 'స్త్రీ2' సినిమా మంచి విజయాన్ని అందుకున్నది. బాలీవుడ్‌లో ప్రతి ఒక్కరూ షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, ఆమిర్ ఖాన్‌తో నటించాలని కోరుకుంటారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి చాలా సంవత్సరాలు గడిచినప్పటికీ ఖాన్ త్రయంతో ఒక్క సినిమా కూడా చేయలేదు శ్రద్ధ. దానికి కారణం ఏమిటనే దానిపై చేసిన కామెంట్లు వైరల్ అవుతున్నాయి. 'స్టార్ హీరోల సినిమాల్లో నటించడం కంటే నా క్యారెక్టర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అనుకుంటాను. గతంలోనే నాకు వారి సినిమాల్లో నటించే ఆఫర్లు వచ్చాయి. నా పాత్రకు ప్రాధాన్యం లేదనే వాటిని తిరస్కరించాను. ఖాన్ త్రయంతో ఎందుకు నటించలేదనే ప్రశ్న ఎదురైతే ఇదే నా సమాధానం. సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ఉంటాను. నాలోని నటికి ఆ క్యారెక్టర్ సరిపోతుందా..? సవాలుగా ఉంటుందా..? అనే విషయాలను పరిగణనలోకి తీసుకుంటాను. నా పాత్రకు ప్రాధాన్యం లేదని అనిపిస్తే.. అందులో హీరో ఎవరున్నా.. అంగీకరించను' అని చెప్పుకొచ్చింది శ్రద్ధా కపూర్. తాజాగా విడుదలైన 'స్త్రీ2' సినిమా ఇప్పటివరకు రూ.300 కోట్లు వసూలు చేసి బాక్సాఫీస్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 2018లో వచ్చిన హిట్ సినిమా 'స్త్రీ'కి సీక్వెల్‌గా ఇది తెరకెక్కింది.



# గొడవైతే ఏడ్చేస్తా

**మహేష్‌బాబు** హీరోగా నటించిన '1 నేనొక్కడినే' సినిమాతో ఇండస్ట్రీలోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది కృతిసనన్. అల్లు అర్జున్ నటించిన 'పరుగు' సినిమా రీమేక్‌తో హిందీలోకి అరంగేట్రం చేసింది. ఆ తర్వాత వరుస విజయాలతో లక్కీ గాళ్ అనిపించుకుంది. తాజాగా 'క్రూ' సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఇటీవల మీడియాతో ఆమె పంచుకున్న కబుర్లు వైరల్ అవుతున్నాయి. 'రిలేషన్‌షిప్ అన్న తర్వాత చిన్నచిన్న గొడవలు సాధారణమే. అయితే, గొడవ జరిగినప్పుడు నా తప్పు ఉంటే తప్పకుండా నేనే సారీ చెబుతాను. నా తప్పు లేకుంటే సారీ చెప్పను. ఏది ఏమైనా ఆ సమస్యను పరిష్కరించుకొని రిలేషన్‌ను కంటిన్యూ చేయడానికి ప్రయత్నిస్తా! ఏదైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు కన్నీళ్లు రావు అని అబద్ధం చెప్పను. అలా గని ప్రతి దానికీ ఏడుస్తూ కూర్చోను. తట్టుకోలేనంత బాధ యితే మాత్రం ఏడ్చేస్తా! నా అనుకున్నవాళ్లతో గొడవైతే మాత్రం వెంటనే కన్నీళ్లు వచ్చేస్తాయి. నాకు సినిమా అంటే ఇష్టం. ఈ రంగంలోనే కొనసాగాలని అనుకుంటున్నా. వర్క్‌లైఫ్ బిజీగా ఉండటమే నిజమైన ఆనందం' అంటున్నది కృతి సనన్.

